సాక్షి గుంటూరు

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



ఘనంగా విశ్వకర్మ జయంతి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం విశ్వకర్మ జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించారు. జెడ్పీ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సాగరమాత గుడిలో సందడి

విజయపురిసౌత్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆదివారం సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. పూజలు చేశారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

నేడు పోలీస్ స్పందన రద్దు

నగరంపాలెం: వినాయక చవితి పండుగ సందర్భంగా ఈనెల 18న గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరగాల్సిన 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత




గుంటూరు మెడికల్: వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ చూసుకోవాలని, ఈ బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు రీజియన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నారాయణ అన్నారు. వినాయక చవితి సందర్భంగా ఆదివారం గుంటూరు గాంధీపార్కు వద్ద, మార్కెట్‌సెంటర్‌లో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనలిస్ట్ వెంకటేశ్వరరావు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 524.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 855.20 అడుగుల వద్ద ఉంది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 2,212 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 76, బ్యాంక్ కెనాల్‌కు 532, తూర్పు కెనాల్‌కు 340, పశ్చిమ కెనాల్‌కు 130, నిజాంపట్నం కాలువకు 270, కొమ్మమూరు కాల్వకు 532 క్యూసెక్కులు విడుదల చేశారు.

సంక్షేమ యజ్ఞం.. నిర్విఘ్నం



ప్రమథగణాలు గణగణమంటూ ముందు కదిలివచ్చాయో ఏమో.. గణపతి ఆలయాలు సుమనోహరమై మెరుస్తున్నాయి. మూషికవాహనం భువికేసి దూసుకొచ్చిందో ఏమో.. గుడిగంటలు ఓం నమో విఘ్నేశాయ అంటూ మార్మోగుతున్నాయి. ఆదిదంపతులు ఆనందతాండవమాడుతున్నారో ఏమో.. ప్రణవనాదం లయబద్ధంగా లంబోదరుని కీర్తిస్తోంది. వీణాపాణీ పార్వతీతనయుడికి స్వాగతం పలుకుతోందో ఏమో.. డమరుక నాదం వేదంలా ఘోషిస్తోంది. ఏకదంతుడు చెంతనే ఉన్నట్టు లోకమే పరవశిస్తోందో ఏమో.. ప్రతిమదీ సుఖ, దుఃఖాలను గజాననునితో పంచుకోవాలని తహతహలాడుతోంది. దీనిని పసిగట్టాడో ఏమో.. విఘ్ననాయకుడు గుంటూరు జిల్లాలో తన పుట్టిన రోజు వేడుక ఎలా జరుగుతుదో చూసి భక్తులను కటాక్షిద్దామని తరలివచ్చారట.. పలువురిని పలకరించి ఆంధ్రదేశాన సాగుతున్న సంక్షేమయజ్ఞం గురించి తెలుసుకుని పరవశులయ్యారట.. విజయోస్తు.. అవిఘ్నమస్తు అంటూ దీవించారట.. ఆయన ఎవరెవరిని కలిశారో చూద్దాం పదండి.. వాస్తవిక సంక్షేమాంధ్రకు అద్దంపట్టేలా అక్షరాలతో అల్లిన సృజనాత్మక సమాహారమిదీ.. – గుంటూరు డెస్క్

విజయోస్తు.. దిగ్విజయోస్తు.. అవిఘ్నమస్తు

- గణపతి నవరాత్రుల్లా నిత్యం శోభిల్లుతున్న నవరత్నాలు
- జన జీవితాల్లో సంతోషాల స్రవంతి
- ఇంటింటా పండగ వాతావరణం
- చూసి ముగ్ధుడైన పార్వతీనందనుడు!

రైతుబాంధవాయనమః



రైతు భరోసా కేంద్రం వద్ద పందిరి కడుతున్న కర్షకుల వద్దకు వెళ్లారు స్వామి. మీ అందరి ఆనందానికి కారణమేమిటని ఆరాతీశారు. జగనన్న పాలనే అంటూ చెప్పుకొచ్చాడు ఓ రైతన్న. సాగునీటి విడుదల నుంచి భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీ, మద్దతు ధర.. ఇలా వారికి ఏవిధంగా ప్రభుత్వం నుంచి భరోసా దక్కుతోందో చక్కగా చెప్పుకొచ్చాడు. ఇలాంటి పాలకుడే తమకు కావాలని. అనుగ్రహించి వెళ్లమంటూ ప్రార్థించాడు. సేద్యం.. శుభమస్తు.. అంటూ ముందుకు నడిచారు గణేశుడు.

గృహ కల్యాయనమః



సెంటు స్థలంలో చక్కగా నిర్మాణమైన ఇంటికి తోరణాలు కడుతున్న దంపతులను చూసి వారి చెంతకు వెళ్లారు స్వామి ఆ గృహస్తురాలి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమ సొంతింటి కల జగనన్న పాలనలో ఎలా సాకారమైందో ఆమె వివరించింది. అద్దెలు చెల్లించుకోలేక సతమతమయ్యే బడుగు జీవులకు జగనన్న ప్రభుత్వం ఎలా వెన్నుదన్నుగా నిలబడిందో పరవశంతో వెల్లడిస్తుంటే సంతోషభరితులయ్యారు పార్వతీనందనుడు.

కని'పింఛెను' సంబరాలు



ఆ పక్కనే ఓ రచ్చబండ.. దాని మీద కొంత మంది వృద్ధులు పండుగకు చుట్టాల ఆగమనం, ఇల్లంతా పిల్లలతో ఉన్న విషయాలు మాట్లాడుకుంటున్నారు. కుటుంబాల్లో సంతోషం నిండి ఉండటాన్ని పరిశీలించారు స్వామి. అందులో ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి విశేషాలు అడిగారు. పూసగుచ్చినట్టు ఒక్కొక్కటీ చెప్పుకువచ్చింది ఆ పెద్దావిడ. ప్రతి నెలా ఒకటో తారీకునే తెల్లవారుజామునే చేతికి పింఛను ఇస్తారని, ఇంటికి డాక్టర్ స్వయంగా వచ్చి పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చి వెళతారని.. ఇదంతా రాజన్న బిడ్డ జగన్ పుణ్యమేనని చెప్పుకువచ్చింది. అంతే కాదు, ప్రభుత్వ సేవలు సులభంగా పొందేందుకు మా ఇళ్లకు దగ్గరలోనే సచివాలయాల ఏర్పాటు, మా బాగోగులు చూసుకోవడానికి మా చెంతనే మా యాభై ఇళ్లకు ఓ వలంటీరు ఇలా అన్నీ కల్పించింది రాజన్న బిడ్డేనయ్యా అంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. నీకు విఘ్నాలు తొలగించే వాడిగా పేరుందిగా స్వామి.. జగనన్న పాలన విఘ్నాలు లేకుండా నిర్విఘ్నంగా సాగేలా అనుగ్రహించమని వేడుకుంది. తథాస్తు అంటూ ముందుకు సాగారు విఘ్నరాజు..

వాహన మిత్రాయనమః



గుంటూరు బస్టాండ్ బయట తాటాకులతో చలువ పందిరి ఏర్పాటు పనుల్లో నిమగ్నమైన ఓ ఆటోడ్రైవర్‌ను లంబోదరుడు కుశల ప్రశ్నలడిగారు. మాటల సందర్భంలో వాహన మిత్ర పథకం వల్ల తాము పొందిన లబ్ధిని విశదీకరించాడు వాహనచోదకుడు. తమ బాగోగులు చూసుకునే పాలకుడిని చల్లగా చూడాలని ప్రతిబంధకాలు తొలగిపోయేలా ఆశీర్వదించాలని అభ్యర్థించాడు. తథాస్తు.. అంటూ స్వామి ముందుకు కదిలారు.

బాల గణపతయేనమః



ఆ.. పక్కనే మట్టిగణపతిని తయారు చేస్తున్న విద్యార్థులు, స్వామి పూజలో ఉంచాల్సిన పుస్తకాలు, కొత్తబట్టలు సిద్ధం చేస్తున్న చిన్నారుల చెంతకెళ్లారు గణనాథుడు. అచ్చం గణేశుడిలా ఉన్నాడే అనుకుని పిల్లలంతా స్వామి చుట్టూ చేరారు. చదువు–సంధ్యలు ఎలా సాగుతున్నాయో స్వామి ఆరాతీశారు. 'నీకు తెలియదా స్వామి? బడికి వెళ్లడం వరకే మావంతు.. ఆ తరువాత అంతా జగన్ మామయ్యే కదా చూస్తోంది. అసలు మా పాఠశాలలకు వచ్చి ఒకసారి చూసివెళ్లు.. అవి మునపటిలా లేవు. అత్యాధునిక వసతులు వచ్చాయి. యూనిఫాంలు, బూట్లు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రోజుకొక మెనూ, ట్యాబ్‌ల ద్వారా ఇంగ్లిషు మీడియం విద్యాభ్యాసం.. ఇవన్నీ ఒనగూరింది జగన్‌మామ వల్లే' అంటూ వివరించారు. 'స్వామీ మా చదువులు సక్రమంగా సాగేలా, జగన్ మామ పాలన సుభిక్షంగా సాగేలా దీవించు' అంటూ చిన్నారులు కోరగా.. అభీష్టసిద్ధిరస్తు అంటూ ముందుకు నడిచారు విఘ్నాధిపతి..

లక్ష్మీగణపతయేనమః



గణపతి నవరాత్రుల నిర్వహణపై చర్చిస్తున్న సువాసినుల చెంతకు చేరారు ఏకదంతుడు. బాగోగులు అడిగారు. తామంతా డ్వాక్రా సభ్యులమనీ, తమ కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలబడేలా తమకు జగనన్న కల్పిస్తున్న పథకాల గురించి, అందిస్తున్న రుణాల గురించి స్వామికి వారు వివరించారు. అలాగే తమ బిడ్డల చదువుకు అమ్మఒడి పేరిట చేకూరిన లబ్ధిని ఓ మాతృమూర్తి స్వామికి విన్నవించింది. జగనన్న ప్రభుత్వం కలకాలం ఉండేలా చూడాలంటూ వేడుకొంది.. మనోసంకల్పసిద్ధిరస్తు అంటూ.. సాగారు స్వామి..

పందిళ్లలో కొలువు



ఇలా ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, వైఎస్సార్ ఆసరా, చేయూత లబ్ధిదారులతోపాటు జలయజ్ఞం ద్వారా చేపట్టిన పలు ప్రాజెక్టులతోపాటు పల్నాడు జిల్లాలో వరికపూడిసెల పనులు త్వరలో సాకారం కాబోతున్నాయని తెలుసుకుని ఆనందభరితులయ్యారు స్వామి.. ఇవి కదా నాకు ఉండ్రాళ్ల కంటే ప్రీతికరమైన నైవేద్యాలు.. కడుపునిండుగా ఉంది అనుకుంటూ పందిళ్లలో కొలువయ్యారు మూషికవాహనుడు.

• భక్తిప్ర'పత్రులతో'..



వినాయక చవితి సందడి అంబరాన్నంటుతోంది. ఊరూవాడా చలువ పందిళ్లు వెలిశాయి. విఘ్నేశుని పూజకు ముస్తాబయ్యాయి. పండగ సందర్భంగా మార్కెట్ కళకళలాడుతోంది. గణేశుని ప్రతిమలు, వివిధ రకాల పత్రి కొనుగోలుకు భక్తులు పోటీపడ్డారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లో పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులను చిత్రంలో చూడొచ్చు. - సాక్షి, ఫొటోగ్రాఫర్, గుంటూరు

ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి సీఎం కృషి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా
- వడ్లమూడిలో రూ.60 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ షాదీఖానా ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, వేదికపై ఉమ్మారెడ్డి, కిలారి వెంకట రోశయ్య తదితరులు

చేబ్రోలు: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి షేక్ బెపారి అంజాద్ బాషా చెప్పారు. వడ్లమూడి గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ షాదీఖానా ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. సమావేశానికి డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు అధ్యక్షత వహించారు. మంత్రి అంజాద్‌బాషా ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు డెప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. ముస్లింల పక్షపాతి వైఎస్సార్ కుటుంబమని కొనియాడారు. మేనిఫెస్టోలో 98శాతం హామీలు అమలు చేసిన సర్కారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని వెల్లడించారు. శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో పొన్నూరు నియోజకవర్గం విశేషంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. త్వరలోనే ఆటో నగర్ ఏర్పాటుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.1,600 కోట్లు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. వీటిలో తొమ్మిది వేల ముస్లిం కుటుంబాలకు రూ.85 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నరేంద్ర సంగం డెయిరీని అడ్డుపెట్టుకొని వందల కోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు.

సృజనకు అధిపతి విశ్వకర్మ

జేసీ రాజకుమారి



విశ్వకర్మ చిత్రపటం వద్ద పూలుజల్లి నమస్కరిస్తున్న జేసీ రాజకుమారి, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ మనోహర్ నాయుడు

గుంటూరు వెస్ట్: సృజనకు, వృత్తులకు అధిపతి విరాట్ విశ్వకర్మ అని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి కొనియాడారు. ఆయన జయంతిని పురస్కరించుకుని ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో విశ్వకర్మ చిత్రపటానికి జేసితోపాటు శాసన సభ్యుడు మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, కుమ్మరి, శాలావాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు (డైమండ్ బాబు) పూల మాలలు వేసి నమస్కరించారు. జేసీ మాట్లాడుతూ దైవశక్తితో విశ్వకర్మ అద్భుతాలు సృష్టించారన్నారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ విశ్వకర్మ కృషిని కొనియాడారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ విశ్వకర్మ గౌరవార్థం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబర్ 17న రాష్ట్ర పండగగా జరుపుకోవాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు.

ఆయేషా ఇంటికి సీబీఐ బృందం

తెనాలిరూరల్: 2007లో హత్యకు గురైన గుంటూరు జిల్లా తెనాలికి చెందిన విద్యార్థిని ఆయేషామీరా కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆదివారం సాయంత్రం తెనాలి వచ్చారు. సీబీఐ ఏఎస్పీ సీఆర్ దాస్ బృందం ఆయేషా తల్లిదండ్రులు షంషద్‌బేగం, ఇక్బాల్‌బాషాలతో మాట్లాడారు. అనంతరం షంషద్‌బేగం విలేకర్లతో మాట్లాడారు. మరోమారు లిఖితపూర్వక స్టేట్‌మెంట్ ఇవ్వాలని కోరారని, తాము నిరాకరించామని తెలిపారు. తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా రీపోస్ట్‌మార్టమ్‌కు అంగీకరించామని, ఆయేషా సమాధిలోని అవశేషాలను 2019 డిసెంబరులో తీసుకెళ్లి, తిరిగి తెస్తామని ఇప్పటివరకు పట్టించుకోకపోవడంపై సీబీఐ అధికారుల బృందాన్ని ప్రశ్నించినట్టు వివరించారు.

మట్టి వినాయకుడిని పూజిద్దాం: మంత్రి అంబటి



సత్తెనపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో కాలుష్య రహితంగా నిర్వహించుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను మాత్రమే పూజించాలని, రంగులతో కూడిన బొమ్మలను దూరం చేయాలన్నారు.

మంత్రి రజని వినాయక చవితి శుభాకాంక్షలు



చిలకలూరిపేట: వినాయక చవితి పురస్కరించుకుని మంత్రి విడదల రజని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు ఆకాంక్షలకు అనుగుణంగా చేసే ప్రయత్నాలను సఫలం చేసుకొనే ప్రయత్నంలో ఎదురయ్యే అడ్డంకులు తొలగించాలని విఘ్నేశ్వరుడిని పూజిస్తారని తెలిపారు. శాంతి సౌభాగ్యాలతో జీవితాన్ని గడపటానికి అవసరమైన శక్తిని ప్రజలకు కలిగించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.



మెగా సెల్ఫీ క్యాంప్‌లో నగర మేయర్ కావటి, కమిషనర్ కీర్తి, పశ్చిమ ఎమ్మెల్యే గిరిధర్, డెప్యూటీ మేయర్లు సజిల, వజ్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా తదితరులు



యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు పక్కన కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్లు సజిల, బాల వజ్రబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా తదితరులు

స్వచ్ఛ, ఆరోగ్య నగరంగా గుంటూరు

- జీఆర్ స్టేడియంలో మెగా సెల్ఫీ క్యాంప్
- భారీగా పాల్గొన్న యువత, ప్రజాప్రతినిధులు

నెహ్రూనగర్: స్వచ్ఛ స్వర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరానికి జాతీయ స్థాయిలో ర్యాంకు తీసుకొచ్చేందుకు గుంటూరు యువత నడుం బిగించింది. ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో భాగంగా ఆదివారం నగరంలోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 3,978 మంది యువతతో మెగా సెల్ఫీ క్యాంప్ నిర్వహించారు. మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామని, గుంటూరు నగరాన్ని స్వచ్ఛ, ఆరోగ్య నగరంగా మార్చుకోవడంలో నగర ప్రజల భాగస్వామ్యంతో అధికారులు, పాలకవర్గం విశేష కృషి చేస్తుందని చెప్పారు. నగరపాలక సంస్థ తీసుకున్న చర్యల వలన ఇటీవల జాతీయ స్థాయిలో నగరానికి స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో 3వ ర్యాంక్ లభించిందన్నారు. ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0లో చేపట్టిన మెగా సెల్ఫీకి నగరంలోని యువత నుంచి అనూహ్యమైన స్పందన లభించిందని వివరించారు. స్వచ్ఛ గుంటూరులో రానున్న కాలంలో నగరంలోని విద్యార్థులు, యువతను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తామన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రెండు రోజులుగా నగరంలోని విద్యా సంస్థల్లో ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో 13 వేల మందికి పైగా రిజిస్టర్ చేయడంతో దేశంలో తొలి స్థానంలో గుంటూరు నగరం నిలిచిందని పేర్కొన్నారు. అతి తక్కువ సమయంలోనే గుంటూరు రెండు సార్లు జాతీయ స్థాయి గుర్తింపు సాధించడం గర్వకారణమన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి జాతీయ స్థాయి గుర్తింపు రావడంలో ప్రజల భాగస్వామ్యం, అధికారులు, పాలకవర్గం, కార్మికుల కృషి విలువైనదని చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా మాట్లాడారు. అనంతరం మేయర్ స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

నూతన తీర్పుల అధ్యయనం అవసరం





మాట్లాడుతున్న జస్టిస్ సోమయాజులు, వేదికపై ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, హాజరైన న్యాయమూర్తులు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు

గుంటూరు లీగల్: సుప్రీంకోర్టు, హైకోర్టుల నుంచి వస్తు న్న నూతన తీర్పుల్ని న్యాయమూర్తులు అధ్య యనం చే యాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో రెండో రోజు ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి అధ్యక్షత వహించారు. జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు మాట్లాడుతూ చట్టాల్లో వస్తున్న మార్పుల్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు ఒకటో అడిషనల్ జిల్లా జడ్జి సీహెచ్. రాజగోపాలరావు, మూడో అడిషనల్ జిల్లా జడ్జి జి.అర్చన, నాలుగో అడిషనల్ జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు, పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామ కృష్ణారావు, తెనాలి పదకొండో అడిషనల్ జిల్లా జడ్జి ఎం.వెంగయ్య, గురజాల పదో అడిషనల్ జిల్లా జడ్జి కె.జయకుమార్, జిల్లాలోని సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఐక్యతతోనే సమష్టి విజయాలు: బొప్పరాజు



గుంటూరు వెస్ట్: ఉద్యోగులు ఐకమత్యంగా ఉంటే సమష్టి విజయాలు సాధించవచ్చని ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగిన 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పని పెరుగుతున్నా ఆ మేరకు సిబ్బంది పెరగకపోవడంతో ఉన్న ఉద్యోగులపైనే భారం పడుతోందన్నారు. దీనివల్ల ఉద్యోగులు విపరీతమైన ఒత్తిడికి లోనై అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. అక్టోబర్ 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని బొప్పరాజు కోరారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ శాఖ కీలక భూమిక పోషిస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం పలు మార్లు శాంతియుత ధర్నాలు, నిరసనలు తెలిపామన్నారు. కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా తరఫున తీవ్రంగా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేకువజామున విషాదం

నాగులుప్పలపాడు/మేదరమెట్ల: ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మద్దిరాలపాడు సమీపంలోని హైవేపై ఆదివారం వేకువజామున ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాలు.. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడుకు చెందిన ఎం.గోపి(27) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బత్తిన అరవింద్(19), మర్రిబోయిన మణికంఠ(21)లతో కలసి శనివారం రాత్రంతా అమ్మవారి కొలుపుల్లో సంతోషంగా గడిపారు. ఆదివారం వేకువజామున 4 గంటల సమయంలో ఒంగోలు వెళ్లి వినాయక విగ్రహానికి అడ్వాన్సు ఇచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మద్దిరాలపాడు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై పంక్చరు పడిన లారీ ఆగి ఉంది. దీనిని గమనించని యువకులు తమ మోటారు సైకిల్‌తో వెళ్లి బలంగా ఢీకొట్టడంతో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ భక్తవత్సల రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

పదోన్నతి పొందిన న్యాయమూర్తులకు సన్మానం



డీఎల్ఎస్ఏ కార్యదర్శి చంద్రమౌళేశ్వరికి విఘ్నేశ్వరుని చిత్రపటాన్ని అందజేస్తున్న న్యాయమూర్తులు

గుంటూరు లీగల్: సీనియర్ సివిల్ జడ్జిలుగా పని చేస్తూ ఇటీవల పదోన్నతి పొందిన గుంటూరు జిల్లాలోని ముగ్గురు న్యాయమూర్తుల్ని ఘనంగా సన్మానించారు. తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు పదోన్నతిపై రాజమహేంద్రవరంలోని 8వ అడిషనల్ జిల్లా కోర్టుకు, గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.చంద్రమౌళేశ్వరి పదోన్నతిపై పెద్దాపురంలోని ఏడో అడిషనల్ జిల్లా కోర్టుకు, బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి.సాధుబాబు పదోన్నతిపై అనంతపురంలోని 8వ అడిషనల్ జిల్లా కోర్టుకు జిల్లా జడ్జిలుగా నియమితులైయ్యారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో ఆదివారం జరిగిన సమావేశం అనంతరం న్యాయమూర్తుల్ని సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో పాటు విఘ్నేశ్వరుని చిత్రపటాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి, జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.